ఏడాదిగా ఏటీఎం మూసివేత

- ఇబ్బందుల్లో వినియోగదారులు
- పట్టించుకోని బ్యాంకు అధికారులు

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్ చౌరస్తాలోని ఎస్‌బీఐ బ్యాంచ్ వద్ద ఉన్న ఏటీఎం గతేడాదిగా మూసి ఉంది. దీంతో డబ్బులు తీసుకునేందుకు వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. గతేడాది సెప్టెంబర్‌లో ఈ ఏటీఎంను దుండగులు ధ్వంసం చేసి రూ. 12 లక్షల నగదును ఎత్తుకెళ్లారు. నాటి నుంచి ఇది అలాగే ఉంది. దానిని పునరుద్ధరించక పోవడంతో వినియోగదారులు అనేక అవస్థలు పడుతున్నారు. జిల్లా సరిహద్దు ప్రాంతంలో ఉండటంతో ఏటీఎంలు ఎక్కడ అందుబాటులో లేక పోవడంతో వినియోగ దారులు ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించి నగదు విత్‌డ్రాల కోసం అధిక డబ్బులు పోగొట్టుకోవాల్సి వస్తోంది.



పోచంపాడ్‌లో మూసి ఉన్న ఏటీఎం కేంద్రం

2023 సెప్టెంబర్‌లో దుండగులు రెక్కి నిర్వహించి ఏటీఎంలో చోరీకి పాల్పడి భారీ మొత్తంలో నగదు ఎత్తుకెళ్లారు. ఏడాది గడిచినా ఆ కేసును పోలీసులు చేదించలేదు. కేవలం ఆ కారు ఎత్తుకెళ్లడానికి దుండగులు వచ్చిన లారీ డ్రైవర్‌ను మాత్రం అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

మెండోరా మండలం పోచంపాడ్ నిర్మల్–నిజామాబాద్ జిల్లాల సరిహద్దు ప్రాంతంలో ఉంది. దీంతో ఏటీఎం సేవలు కావాలంటే బాల్కొండ మండలం కిసాన్‌నగర్‌కు వెళ్లాలి. లేదంటే నిర్మల్ జిల్లా కేంద్రానికి వెళ్లాలి. ఇలా దూర భారం ఎక్కువగా ఉండటంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే పోచంపాడ్ ఎస్‌బీఐ బ్యాంకు వద్ద ఉన్న ఏటీఎం కేంద్రాన్ని పునరుద్ధరించాలని వినియోగదారులు, ప్రజలు కోరుతున్నారు. ఏటీఎం సేవలను పునరుద్ధరించక పోవడంపై బ్రాంచ్ మేనేజర్ బాల్‌రాజ్‌ను సాక్షి ఫోనులో పలుమార్లు సంప్రదించినా ఎలాంటి స్పందన ఇవ్వలేదు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- అడిషనల్ కలెక్టర్ అంకిత్


పెర్కిట్ మోడల్ స్కూల్‌లో సరుకులను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

పెర్కిట్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అడిషనల్ కలెక్టర్ అంకిత్ అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధి పెర్కిట్‌లోని మోడల్ స్కూల్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని అన్నారు. అనంతరం వంటగదిలో వండిన ఆహార పదార్థాలను, నిలువ ఉంచిన సరుకులను పరిశీలించారు. అనంతరం పట్టణంలోని 26వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పర్యవేక్షించారు. ఆయన వెంట తహసీల్దార్ గజానన్, శానిటరీ ఎస్సై గజానంద్, వార్డ్ ఆఫీసర్ నాగరాజు ఉన్నారు.

డొంకేశ్వర్‌లో..

డొంకేశ్వర్: మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఎంపీడీవో శ్రీనివాస్ రావు మధ్యాహ్న భోజనాన్ని బుధవారం పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వారంలో రెండు సార్లు పాఠశాలను తనిఖీ చేసి భోజనాన్ని పరిశీలిస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని హెచ్‌ఎం సురేశ్ కుమార్‌కు సూచించారు. ఎంఈవో రామకృష్ణ, జీపీ కార్యదర్శి శేఖర్ ఉన్నారు.


డొంకేశ్వర్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీడీవో

చందూర్‌లో..

వర్ని: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని లేకపోతే ఏజెన్సీలను రద్దు చేస్తామని చందూర్ ఎంపీడీవో నీలావతి సూచించారు. చందూర్ జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. తాజా కూరగాయలతో నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని సూచించారు. ఉపాధ్యాయులు ప్రతిరోజూ భోజనాన్ని పరిశీలించి వారు తిన్న తర్వాతే విద్యార్థులకు వడ్డించాలని సూచించారు.


చందూరులో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఆర్మూర్ అభివృద్ధికి కృషి

మున్సిపల్ ఛైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నట్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధికి సంబంధించిన 31 అంశాలను ఏకగ్రీవంగా తీర్మానించగా కౌన్సిలర్లు ఆమోదం తెలిపారు. పట్టణంలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.


సమావేశంలో నేలపై కూర్చొని నిరసన తెలుపుతున్న బీజేపీ ఫ్లోర్ లీడర్

ఆర్మూర్‌లో ప్రతిరోజు కుక్కల దాడులు జరుగుతున్నా కలెక్టర్ పట్టించుకోవడం లేదని ప్రభుత్వం తక్షణమే కలెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని బీజేపీ ఫ్లోర్‌లీడర్ జీవీ నర్సింహారెడ్డి అన్నారు. 36వార్డులో 15మందిపై కుక్కలుదాడి చేసి గాయపర్చిందన్నారు. కుక్కల బెడదను నివారించాలని నర్సింహారెడ్డి సమావేశంలో నేలపై కూర్చుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్‌మున్ను, మున్సిపల్ కమిషనర్ రాజు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని ధర్నా



రుద్రూర్: అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బుధవారం పోతంగల్ మండల కేంద్రంలో స్థానికులు ధర్నా చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే కొత్త రేషన్ కార్డులను ఇవ్వాలని నినాదాలు చేశారు. అనంతరం తహసీల్ కార్యాలయానికి చేరుకొని వినతిపత్రం అందజేశారు. దరఖాస్తులు చేసుకున్న వారికి వెంటనే కొత్త కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బజరంగ్ హన్మాండ్లు, కిరణ్, శంకర్, అశోక్, తుకారం, రవి, సాయిలు, గౌస్, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గీతా జయంతి


ఆర్మూర్‌లో..

ఆర్మూర్‌టౌన్/ బాల్కొండ/ మోర్తాడ్: ఆర్మూర్ పట్టణంలోని శ్రీ సరస్వతీ విద్యా మందిర్ పాఠశాలలో బుధవారం గీత జయంతిని ఘనంగా నిర్వహించారు. భగవద్గీత సారాంశాన్ని విద్యార్థులకు ప్రిన్సిపాల్ వినోద్ కుమార్ వివరించారు. 'గీ'అనే అక్షరం త్యాగాన్ని బోధిస్తుందని,'త' అనే అక్షరం తత్వాన్ని అంటే ఆత్మ స్వరూపాన్ని ఉపదేశిస్తుందని అన్నారు. భగవద్గీత మహాభారతం యుద్ధానికి ఆ దిలో ఆవిర్భవించిందని పేర్కొన్నారు. భగవద్గీతలో మొత్తం 18 అధ్యాయాలు ఉన్నాయని అన్నారు. అనంతరం చిన్నారులు వేసిన నాటకాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శైలజ, సోనాలి, మంజుల, సింధూజ, లత, ప్రియాంక, వేద, వనిత, విద్యార్థులు పాల్గొన్నారు.


మోర్తాడ్‌లో..

బాల్కొండ మండల కేంద్రంలోని శ్రీకృష్ణ మందిరంలో హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో గీతా జయంతిని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు గీతాపై వ్యాసరచన పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబర్చిన వేంకటేశ్వర పాఠశాల విద్యార్థులకు గీతా గ్రంథాలను బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో శంకర్, రాజేశ్, నరేందర్, రాజు, తోపారం అశోక్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్ మండల కేంద్రంలోని చతురస్రా పాఠశాల ఆధ్వర్యంలో గీతా జయంతిని ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు గీతా శ్లోకాలను ఆలపిస్తూ గ్రామంలో ర్యాలీ చేపట్టారు. ప్రిన్సిపాల్ నంబుల గిరి, విద్యార్థులు పాల్గొన్నారు.


బాల్కొండలో భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేస్తున్న హిందూ ఐక్యవేదిక సభ్యులు

ప్రతిభను వెలికితీయడానికే పోటీలు


డొంకేశ్వర్‌లో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీడీవో


చందూర్‌లో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు


రెంజల్‌లో క్రీడాకారులతో అధికారులు

- సీఎం కప్ క్రీడా పోటీల్లో అధికారులు
- పలు చోట్ల పోటీలు ప్రారంభం

డొంకేశ్వర్/ వర్ని/ రెంజల్/ మోర్తాడ్/ ఎడపల్లి: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడానికే సీఎం కప్ పోటీలను నిర్వహిస్తోందని పలువురు అధికారులు అన్నారు. డొంకేశ్వర్ మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను ఎంపీడీవో శ్రీనివాస్‌రావు ప్రారంభించారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధృడత్వాన్ని అందిస్తాయన్నారు. మండల స్థాయిలో గెలుపొందిన వారు జిల్లా స్థాయిలో, జిల్లా స్థాయిలో గెలిచిన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంఈవో రామకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ వసంత్, హెచ్‌ఎం సురేశ్‌కుమార్, ఉపాధ్యాయులు, పీఈటీలు పాల్గొన్నారు. వర్ని, చందూర్, మోస్రా మండల కేంద్రాల్లో సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించారు. చందూర్ మండల కేంద్రంలో కొనసాగుతున్న కబడ్డీ పోటీలను ఎంపీడీవో నీలావతి పరిశీలించారు. రెంజల్ హైస్కూల్‌లో మండల స్థాయి సీఎం కప్ పోటీలను ఎంపీడీవో వెంకటేశ్‌జాదవ్, మాజీ ఎంపీపీ మొబిన్‌ఖాన్ ప్రారంభించారు. ఎంఈవో ఆంజనేయులు, సూపరింటెండెంట్ శ్రీనివాస్, నాయకులు సాయారెడ్డి, సాయిబాబాగౌడ్, కార్తీక్, ఇందిరారెడ్డి, పోచయ్య, కుర్మె శ్రీనివాస్, మర్ల రమేశ్, వెంకటి, కిరణ్, పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి కిశోర్‌కుమార్, పీడీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. భీమ్‌గల్ పట్టణంలో సీఎం కప్ క్రీడా పోటీలను మున్సిపల్ ఛైర్‌పర్సన్ కన్నె ప్రేమలత ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్ వై రామకృష్ణ, కౌన్సిలర్ సీహెచ్ గంగాధర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు జేజే నర్సయ్య, నాయకులు దారావత్ లింగయ్య, సతీశ్‌గౌడ్, అనంతరావు, మల్లెల లక్ష్మణ్, సతీశ్, భూషణ్ తదితరులు పాల్గొన్నారు. మోర్తాడ్‌లో సీఎం కప్ క్రీడా పోటీలు ముగిశాయి. రెండు రోజుల పాటు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో తిరుమల, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు జక్కం అశోక్, కాంగ్రెస్ నాయకులు గిర్మాజీ గోపి, తక్కూరి సతీశ్, పుప్పాల అశోక్, ఫిజికల్ డైరెక్టర్ శ్యామ్, తిమ్మాపూర్ పీఈటీ సింధూజ తదితరులు పాల్గొన్నారు. ఎడపల్లి మండలంలోని ఏఆర్‌పీ క్యాంప్‌లోని జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీలు ముగిశాయి. క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని ఎంపీడీవో శంకర్, ఎంఈవో సాయిలు అన్నారు. అనంతరం విజేత జట్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.


భీమ్‌గల్‌లో క్రీడాకారులతో అధికారులు


మోర్తాడ్‌లో బహుమతులు పంపిణీ చేస్తున్న నాయకులు

అధికారులకు వినతి

నవీపేట: మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ నిర్వాహకులు బుధవారం తహసీల్దార్ వెంకట రమణ, ఎంఈవో అశోక్‌కు వినతిపత్రాలు అందజేశారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. ఏజెన్సీ కార్మికులకు రూ. 10 వేల వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నిర్వాహకులు

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

బోధన్‌రూరల్: విద్యుత్ ప్రమాదాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని బోధన్ ట్రాన్స్‌కో డీఈ ఎండీ ముక్తార్ అన్నారు. విద్యుత్ శాఖ బోధన్ రూరల్ సెక్షన్ ఆధ్వర్యంలో బుధవారం ఫాండుతర్నా శివారులో రైతుల పొలాల్లో 'విద్యుత్ శాఖ – రైతుల పొలంబాట' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు, వ్యవసాయ కూలీలకు విద్యుత్ ప్రమదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆరుగాలం శ్రమించి సాగు చేసే అన్నదాతలకు మెరుగైన సేవలు అందించేందుకు తాము కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటారని అన్నారు. రైతులు తమ పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారితే వెంటనే సమాచారం అందించేందుకు తమ కార్యాలయంలో లేదా 1912 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలన్నారు. విద్యుత్ మరమ్మతులకు ప్రైవేటు ఎలక్ట్రిషియన్లను ఆశ్రయించవద్దని స్థానిక విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందిని సంప్రదించి మరమ్మతులు చేయించుకోవాలన్నారు. ఇటీవల బోధన్ డివిజన్ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్లు అధికంగా చోరీలకు గురవుతున్నాయని, ఈ సమస్యలను అధిగమించేందుకు రైతులు రాత్రి సమయాల్లో పొలాల వైపు నిఘా ఉంచాలన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే విద్యుత్ శాఖ, పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఓవర్ లోడ్ సమస్యలను అధిగమించేందుకు కరెంట్ బోర్లకు కెపాసిటర్లను అమర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఈ నాగేశ్ కుమార్, ఏఈ నాయిని కృష్ణ, లైన్ ఇన్‌స్పెక్టర్ సుందర్‌రావు, జనార్దన్, ఫోర్‌మన్ పెంటయ్య చారి, లైన్‌మన్‌లు బాల్‌రాజ్, నాగేశ్, రైతులు సుబ్బారెడ్డి, చెన్నరెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి, గంగారాం తదితరులు పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న ట్రాన్స్‌కో డీఈ ముక్తార్

బ్రాహ్మణ సంక్షేమానికి సహకరించాలి



నిజామాబాద్ రూరల్: బ్రాహ్మణుల సంక్షేమానికి సహకరించాలని కోరుతూ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు కిరణ్ దేశ్‌ముఖ్ ఆధ్వర్యంలో సంఘం సభ్యులు రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబును హైదరాబాద్‌లో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా కేంద్రంలో బ్రాహ్మణ భవనం, వేద పాఠశాల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం మంత్రిని సన్మానించారు. కార్యక్రమంలో రొట్టె సురేశ్ శర్మ, పుల్కల్ రమేశ్, జయంత్ రావు, కోస్లి చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)
స్క్రీన్-2 – పుష్ప-2(తెలుగు) – 10.15 2.20 6.25 10.30
స్క్రీన్-3 – పుష్ప-2(తెలుగు) – 9.30 1.35 5.40 9.45
స్క్రీన్-4 – పుష్ప-2(తెలుగు) -2.05 6.10

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఫిషియన్)
స్క్రీన్-1 పుష్ప-2(తెలుగు)-10.15, 2.00,6.00,10.00
స్క్రీన్-2 పుష్ప-2(తెలుగు)-1.00,4.45,9.10
స్క్రీన్-3 పుష్ప-2-11.00,3.10,7.00,10.45

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)
స్క్రీన్-1 పుష్ప-2(తెలుగు)-10.15 2.20 6.25,10.30
స్క్రీన్-2 పుష్ప-2(తెలుగు)-9.30,1.35, .5.40, 9.45
స్క్రీన్-3 పుష్ప-2(తెలుగు)-10.00,2.05, 6.10, 10.15
స్క్రీన్ -4 పుష్ప-2(తెలుగు)-9.45,1.50, 5.55, 10.20

లలితామహల్ కేసీఆర్(తెలుగు)
దేవి పుష్ప-2(తెలుగు)
నటరాజ్ పుష్ప-2 (హిందీ)
విజయ్ పుష్ప-2 (తెలుగు)

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	78,800	వెండి(కిలో)	95,200
22 క్యారెట్స్	72,705	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సెడ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	220	మటన్	800

గణితంపై పట్టు సాధించాలి

నిజామాబాద్‌అర్బన్: విద్యార్థులు గణితంపై పట్టు సాధించాలని జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి అన్నారు. బుధవారం నగరంలో న్యూఅంబేడ్కర్ భవన్‌లో తెలంగాణ గణిత ఫోరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి గణిత ప్రతిభా పరీక్ష పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. జిల్లా గ్రంథాలయ సంస్థ తరపున అన్ని పాఠశాలలకు అవసరమయ్యే గణిత పుస్తకాలను ఉచితంగా అందిస్తామని తెలిపారు. అనంతరం డీఈవో అశోక్ మాట్లాడుతూ.. గణితం చాలా సులువైన సబ్జెక్ట్ అని అన్నారు. ఏ ఉద్యోగానికైనా రాసే పోటీ పరీక్షల్లో గణితం తప్పకుండా ఉంటుందన్నారు. చిన్న వయస్సు నుంచే గణితంపై పట్టు సాధించాలన్నారు. గురుకృప ఫౌండేషన్ ఎంపిక చేసిన ఐదుగురు ఉత్తమ గణిత ఉపాధ్యాయులకు గణితరత్న పురస్కారంతో సన్మానం చేశారు. పోటీ పరీక్షల ఫలితాలను విడుదల చేసి రాష్ట్రస్థాయికి ఎంపికైన పిల్లలను అభినందించి వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఆర్వీఎన్ గౌడ్, సాయారెడ్డి, గణిత ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి గంట అశోక్, దారా చంద్రశేఖర్, కాంతారావు, గోపాలకష్ణ, శ్రీనివాస్, రమేశ్, వెంకటేశ్వరరెడ్డి, ఎం సాయిలు, సీవీఆర్ నారాయణ, జి రమేశ్, పరమేశ్వర్, కె రమేశ్, వీరేందర్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న నిర్వాహకులు

క్లుప్తంగా

గోరక్ష మహాపాదయాత్ర



ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌కు బుధవారం గోరక్ష మహాపాదయాత్ర చేరుకుంది. ఈసందర్భంగా అఖిల భారత దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో గోరక్ష మహాపాదయాత్రకు ఘన స్వాగతం పలికారు. అఖిల భారత గోసేవ ఫౌండేషన్ బాలకృష్ణ గురుస్వామి కాశ్మీర్ టు కన్యాకుమారి వరకు 14 రాష్ట్రాలు 4900 కిలోమీటర్లు 180 రోజులు గోమాత పాదయాత్ర చేస్తున్నారని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో గురుస్వాములు నగేశ్ శర్మ, అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు పెంట జలందర్, సురేశ్, మీసాల రాజేశ్వర్, చేపూర్ ధనంజయ్, అశోక్, గంగాధర్‌గౌడ్, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

ఏసు చూపిన మార్గంలో పయనించాలి

ఆర్మూర్: ఏసు చూపిన శాంతిమార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని పాస్టర్ బి విన్‌స్టన్ సూచించారు. పట్టణంలోని సీఎస్ఐ బధిరుల ఆశ్రమ పాఠశాలలో క్రిస్మస్ వేడుకల్లో భాగంగా ముషీరాబాద్ సీఎస్ఐ చర్చి ప్రతినిధులు బుధవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రెండు ఎల్ఈడీ టీవీలు, 15 సీలింగ్ ఫ్యాన్లు, 20 కుర్చీలు, వాటర్ ప్యూరిఫైయర్‌తో పాటు విద్యార్థులకు యూనిఫాంలు, ప్లేట్లు, గ్లాసులు, బెడ్ షీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శాంగమూర్తి, మేనేజర్ సువర్ణ కిరీటి, స్థానిక చర్చి పాస్టర్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఎస్తేర్, నిర్మల, సుధ, మాధవి, లక్ష్మి, దిలీప్, మణిదర్ పాల్గొన్నారు.

సుద్దులంలో ఉచిత పశువైద్య శిబిరం



రుద్రూర్: కోటగిరి మండలం సుద్దులంలో బుధవారం పశు సంవర్ధక శాఖ, పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. దూడల ప్రదర్శన చేపట్టారు. శిబిరాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ గాయక్వాడ్ హన్మంతు ప్రారంభించారు. అధిక పాల ఉత్పత్తి చేస్తున్న రైతులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీద్ హైమద్, సురేశ్ కుమార్, సంతోష్ రెడ్డి, మంజుల, సుదీర్ గౌడ్, తిరుపతి, రాము, నాగేశ్, రియాజ్, సాయిలు, రాజేశ్, రైతులు పాల్గొన్నారు.

విగ్రహాల ఊరేగింపు



వర్ని: మండలంలోని సిద్ధాపూర్ తండాలో గురువారం ఉదయం శివాలయం ప్రారంభోత్సవం సందర్భంగా గ్రామంలో దేవతామూర్తులను గ్రామస్తులు బుధవారం ఊరేగింపు చేపట్టారు. ఆలయం వద్ద వేద పండితులు దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. గురువారం ఆలయ ప్రారంభోత్సవానికి బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి హాజరుకానున్నారు. ఊరేగింపులో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శబరిమలకు ప్రత్యేక బస్సులు



ఆర్మూర్‌టౌన్: ఆర్టీసీ ఆర్మూర్ డిపో ఆధ్వర్యంలో శబరిమలకు వెళ్లే అయ్యప్ప స్వాములకు బస్‌రేట్లను ఆర్టీసీ భారీగా తగ్గించిందని డిపో మేనేజర్ రవికుమార్ తెలిపారు. శబరికి వెళ్లే పట్టణ పరిసర అయ్యప్పస్వాములు ఆర్మూర్ డిపోలో బస్‌లను బుకింగ్ చేసుకోవాలని ఆయన కోరారు.

అర్హులకు 'డబుల్' ఇళ్లు మంజూరు చేయాలి

రుద్రూర్: అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ సురేందర్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం ఏరియా కార్యదర్శి నన్నేసాబ్, నెల్లూరి లక్ష్మణ్, గంగాధర్, భీమయ్య, సాయిలు, హన్మవ్వ తదితరులు పాల్గొన్నారు.

